# బంధుప్రేమ

ఏదో నలుగురు వస్తూపోతూ వుంటేనే యిల్లు. మనతో పాటు మరొక విస్తరి లేవనిదే, అదీ ఒక యిల్లేనా! అతిథి అభ్యాగతుల మాట ఎలా వున్నా, చుట్టాలూ, పక్కాలూ ఎప్పుడూ కాకపోయినా అప్పుడప్పుడు వుండాలి. సంపద మాట చెబుతున్నప్పుడు దుర్యోధన సంపత్తి—అన్నారు అందుకనే! ధర్మరాజు మాట ఎవరికి కావాలి; ఎవరు చెప్పుకుంటారు? రక్త సంబంధం వుంది చూశారూ, అది కోసేసుకుంటే పోదు. గుప్పెడు మెతుకుల కోసం కరువు వాచి మన యింటికి ఎవరూ రారు. శాంతాదేవి బంధుప్రేమ అంత ఉత్కృష్ఠమయినది.

అందుకు పూర్తిగా భిన్నుణ్ణి నేను. ఆమె అభిప్రాయాలు వరస వరసగా నేను ఖండించగలను. నా వాదమే సత్య సమ్మతమైనదని రుజువు చెయ్యగలను. నలుగురు, అయినప్పుడూ కానప్పుడూ వస్తూవుంటే, యింట్లో శాంతి ఉండదనీ, అతిథి అభ్యాగతుల కాలం అయిపోయిందనీ, దుర్యోధన ధర్మరాజుల మాట అటు వుంచి, రక్తసంబంధమనేది హైకోర్టులో దావా వున్నప్పుడో, హాస్పటల్‌లో రోగి వున్నప్పుడో మాత్రం జ్ఞాపకంవస్తుందనీ, గుప్పెడు మెతుకులు వేసేందుకు బయట పదిపన్నెండణాలు పుచ్చుకుంటారనీ నేను సౌమ్య వాక్యాలతో చెప్ప ప్రయత్నించానా, ఆమె ఒప్పుకోదు,

నాది కుతర్కం అనీ, నాకు ధర్మచింతన లేదనీ అంటుంది. తన కేదో ధర్మచింతన మహా వున్నట్టు!

ధర్మయుగం పోయి ఆర్థిక యుగంలో నివసిస్తున్నామని శాంతా దేవికి చూచాయగా తెలిసినప్పటికీ, ఆమె నాముందు వొప్పుకోదు. వొప్పుకోకూడదని నిశ్చయం చేసుకున్న మనిషిని వొప్పించడమెలా ? అందుకని, నాలుగుగోడల మధ్య నారీమణిదే రాజ్యమని నన్ను నేను సమాధాన పరుచు కుంటాను.

ఆవేళ పొద్దుటే వర్షం పడుతోంది. ఏడున్నర అయినప్పటికీ ఎండ పొడలేదు. చినుకులు దబదబా పడుతూనే వున్నాయి. కొద్దిగా చలేస్తోంది కూడాను. పాలవాడు రాలేదు. అంచేత డబ్బాపాల కాఫీ చేసుకున్నాం. కాఫీ గత ప్రాణులకి ఏదో ఒక కాఫీ కావాలిగా! అసలు, నేను అంత పొద్దున్నే లేవడం ఎప్పుడో గాని జరగదు. తెల తెల వారుతూ వుండగా నాకొక కలవచ్చింది. భారత ప్రభుత్వం నన్ను ఏదో పనిమీద లండన్ పంపించింది. విమానంమీద వెళ్లాను. తిన్నగా చర్చిల్ గారింటికి వెళ్ళి ఏదో మాట్లాడుతూ వుండగా, ఆయన తన నోట్లోని చుట్టతీసి నన్ను గద్దించిబోయాడు. ఇంతలో బుడుక్కున మెళకువ వచ్చింది. అలాంటికల కరిగిపోవడంవల్లనే, అంతపొద్దుటే నిద్ర పక్కమీదనుంచి లేవడం జరిగింది.

కాస్త పొద్దెక్కితే రాత్రి కలలు మర్చిపోతాము గనక, కాఫీ తాగుతున్నప్పుడే శాంతాదేవికి "స్వప్నసీమలో నేను సలిపిన విహారం" గురించి చెప్పాను.

"అయితే, నేను లేకుండా మీరొక్కరే వెళ్లారన్న మాట లండను?" అంది.

"కల కదోయ్!"

"కలలో మాత్రం నేను లేకుండా మీరెందుకు వెళ్ళాలి?"

చిక్కున పడ్డమాట నిజమే! ఎలా చెబితే ఆమెకి నచ్చుతుంది? కలలో కూడా సహధర్మచారిణి వెంట నుండవలసిందేగా!

"మీరు కలలో వెళ్లారు. మా అన్నయ్య, చూడండి, నిజంగా వెళ్తాడు. నాకు లండన్ చూడాలని లేదుగాని, సాయంత్రం "న్యూగ్లోబ్" కి తప్పకుండా తీసుకు వెళ్ళండి— చాలా మంచి పిక్చర్. ఆఫీసు వేళకి మీకు వంట ఎలా అయ్యేదీ తెలియకుండా ఉంది. పొద్దుటే వచ్చిన వర్షం, పొద్దెక్కి వచ్చిన బంధువు..."

"అనకు, అనకు. ఆ మాట ఘట్టిగా అనకు" అని వారించాను.

శాంతాదేవి ఆమాట ఘట్టిగా అనవలసిన పని లేక పోయింది. వీధిలో టాక్సీ హారన్ భోరున అరుస్తోంది, బంధువులకి స్వాగతమా అన్నట్టు వాన దేవుడు హోరున చినుకులు కురిపిస్తున్నాడు. వెనక సీట్లోనుంచి ముగ్గురు ఆడంగులూ, ముందు సీట్లోనుంచి ఒక ఖద్దరు బట్టల ఆసామీ దిగారు.

ఇద్దరమూ—అనగా నేనూ శాంతాదేవీ-కాఫీ గ్లాసులతో నడవలోకి వెళ్ళాం. ఆడంగులలో ఒకామె జారిపడేటంత పనిజరిగింది. సామానులతో సహా మనుష్యులు నడవలోకి పురికారు. నడవ అంతా తడి కాళ్ళతో నీళ్ళు నీళ్ళు అయింది.

బంధుప్రేమ లేనివాణ్ణి కాబట్టి నాకు బంధువులు అంటూ లేరు. బంధువర్గమంతా ఆమెదే! ఏ కాలేజీ స్నేహితుడో నన్ను చూడటానికి వచ్చినా, భార్యా బిడ్డలతో మా యింటి మీదికొచ్చి పడడు. నన్ను ఆఫీసులో కలుసుకుంటాడు. ఇద్దరం కలిసి అలా బీచివెంట తిరిగి, చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటాము; ఒక్కపూట మా యింట్లో భోం చేసేం దుకు కూడా ఎంతో మొహమాట పెడితేగాని రాడు. ఇక ఆ స్నేహితుడి భార్యా, మా శాంతాదేవీ కలుసుకోవడ మనేది, ఎక్కడో నూటికీ కోటికీను.

ఎందుకు చెప్పొచ్చానంటే, వుప్పెనగా వచ్చిపడ్డ వాళ్ళ ముక్కూ మొహం నాకు తెలియదు. ఏ రకంగా, ఆ ఖద్దరు బట్టల ఆసామీతో సంభాషణ ప్రారంభించాలో దిక్కు తెలియక వెర్రిమొహం వేశాను. అంతకీ 'రండి—రండి' అంటూ ఏదో ఆప్యాయత ప్రదర్శించాను.

"అమ్మాయ్—జ్ఞాపకం ఉన్నానా?" అన్నా డాయన.

శాంతాదేవి నిజస్వరూపం తెలుసుకునేందుకు, అలాటి క్షణాల్లోనే ఫోటో తియ్యాలి.

సమాధానం చెప్పే వ్యవధి యివ్వకుండానే, "పురుషోత్తాన్ని, శాంతమ్మ" అన్నాడు.

శాంతా—అని అనకూడదూ? అమ్మా బామ్మాను! శాంతా దేవికి కోపం రావలసిందే—ఎందుకు రాలేదోగాని! అమ్మగారూ అనక, శాంతమ్మగారూ అని అంటోందని, వెనక ఒక పని మనిషిని మానిపించేసింది శాంత. నిజమే-మరి. పిలుపులో కూడా నాజూకు వుండాలి. పెద్దా పేరక్క-ఏమిటి 'శాంతమ్మా' అని పిలిచేందుకు! శాంతా దేవిగారు ప్రస్తుతం యిలాంటి పట్టింపుల గురించి ఆలోచించే స్థితిలో లేరు; పురుషోత్తాన్ని చూసి విస్తుబోతున్నారు.

అరగంట పోయాక అందరం తేరుకున్నాం. వారికి కావలసిన దంతధావనాది పరికరాలు సమకూర్చి, ఆపైన కాఫీ పెట్టి యిచ్చింది నలుగురికీను. ముగ్గురు స్త్రీలలోనూ పెద్దావిడకి నలభై ఏళ్ళుంటాయి—లావుగా ఉంది; రెండో ఆవిడ బక్క పలచగా మిసమిసలాడుతూ వుంది—యిరవై యిరవై రెండు వుండవచ్చు. మూడవ స్త్రీ పదహారు పదిహేడేళ్ళదయినా పరికిణా వోణీ వేసుకు, కులుకులాడిలా వుంది. పెద్దావిడ వెనక వొత్తిగిలి నుంచుని, వీరిద్దరూ సిగ్గు అభినయించడం నా కెందుకో మొదట్నుంచీ గిట్టలేదు.

ఇక—పురుషోత్తంగారి సంగతా? ఆయన సకల విద్యా పారంగతుడు. ఆ మహానుభావుడు శాంతా దేవికి తల్లివైపు చుట్టమూ కాదు; తండ్రివైపు చుట్టమూ కాదు. వాళ్ళ

యిల్లూ వీళ్ళ యిల్లూ ఎదురు బదురుగా ఉండేవట—ఎప్పటి మాట? ఏడేళ్ళ క్రితంమాట. రెండేళ్ళ క్రితం శాంత చెప్పిన యడ్రస్ పాగేసుకోక, అట్టేపెట్టి, యిలా మామీదికి దూకాడు.

వర్షం తెరిపి యివ్వకపోయినా, పాపం పనిమనిషి వచ్చింది. పనిమనిషికూడా రాకపోతే గత్యంతర మేమిటా అని దమ్మిడీకాసంత మొహంచేసుకున్న శాంతాదేవి ప్రాణానికి పూరట కలిగింది. పని మనిషికి అంటగిన్నెలూ అవీ పడేసి, నన్ను వంటయింట్లోకి రమ్మనమని సైగ చేసింది శాంత.

"ఏమిటి?" అని అడిగాను శాంతని. వంట ఇంట్లో ఇద్దరమూ గూడుపుఠాణీ చేస్తున్నాం.

"డబ్బు ఏమయినా వుందా?"

డబ్బా? ఇరవై రెండవ తేదీన పట్నవాసుడి దగ్గర డబ్బు ఏముంటుంది? నెలాఖరు దాకా బండి లాగేందుకు అడుగూ బొడుగూ వుంటుంది—అంతకంటె ఏమి మిగులుతుంది? అందరిలా కాక మేము కాస్త జాగర్త పరులమే. ఉన్న దానిలో నాలుగురాళ్ళు వెనకేసుకునే మనుషులమే. కాని, ఈమధ్య, నిలవజేసిన కూసింతో కాసింతో ఉంటే, అది పెట్టి గవర్నమెంటు పేపరు కొన్నాం. బాంకులోకూడా ఏమీ లేదు.

"నీకు తెలియని డబ్బెక్కడిది?"

"అది కాదండీ. నాదగ్గిర యింక ఒకే ఒక్క పదిరూపాయల నోటు ఉంది—రెండో మూడో చిల్లర వుంటే, అదేం లెఖ్ఖలోకి వస్తుంది! ఇవ్వాళ యింకా యిరవై రెండా! వీళ్ళు ఎందుకొచ్చారో, ఎన్నాళ్ళుంటారో తెలియదాయిరి. సాయంత్రం ఎవర్నయినా అడిగి పాతికో ముప్ఫయో పట్టుకు రాకపోతే అప్రతిష్ఠ పాలవుతాం."

"అసలు వీళ్ళెవరు! ఎందుకొచ్చారు? హాస్పటల్ పని మీదనే వచ్చినట్టున్నారు —చూడగా!"

"ఏమో—నాకు తెలిసేడ్చును గనకనా! 'ఎక్కడ వుంటున్నారే, అమ్మాయ్' అంటే ఏదో యడ్రస్ చెప్పాను. ఇలా నెత్తి నెక్కుతారని నాకేం తెలుసు?"

"బంధుప్రేమగల దానివినువ్వు. అలా అనకూడదు."

"ఊఁ. మీకు టైము దొరికింది, అనండి" అని చురచుర చూసింది. శాంతాదేవి.

కాని శాంతాదేవిమీద నాకాక్షణాన ఎంతో జాలి పుట్టుకొచ్చింది. నేను ఆఫీసుకు పోయి, ఫానుకింద (వర్షం పడుతున్నా) కుర్చీలో కూచుంటాను. ఆడదై పుట్టడంవల్ల నేగదా ఈ అమాయకురాలు వీళ్ళందరికీ వండి, వార్చి పెట్టాలి. ఆ పెద్దావిడకి మడీ ఆచారం కూడా వున్నట్టున్నాయి చూడగా.

శాంతాదేవి ముక్కు పట్టుకు యిటూ అటూ వూగించాను.

"అబ్బ—ఎంత ప్రేమ" అని నవ్వేసి, నలుగురి మధ్యకి వచ్చింది శాంత.

ఆ పూట గృహమేధి హోటల్ మెతుకులే భుజించాడు.

*　　　*　　　*　　　*

సాయంత్రం యింటికి వచ్చే వేళకి, ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. మా పడకగది తప్ప మిగతా యిల్లంతా మారిపోయింది. పరిచిన హోల్డాల్స్ అలానే వున్నాయి. చీరెలు ఒకవైపు కుప్పగా పడి వున్నాయి మరచెంబూ పళ్ళబుట్టా, గొడుగూ, చెప్పుల జతలూ, కుర్చీలూ, పత్రికలూ—ఒకటేమిటి యింట్లో వస్తువులన్నీ చెల్లాచెదరుగా పడి వున్నాయి. ఫ్లాస్కులో టీ గ్లాసులోపోస్తూ, అశోక వృక్షం కిందవున్న సీతాదేవిలా శాంత అంది, "ఇవ్వాళ చేతులు పడిపోయాయనుకో నమ్మండి. ఒక్క క్షణం నడుం వాల్చడానికి వీలు చిక్కలేదు కదా! వాళ్ళు వీధిలోకి వెళ్ళగానే ఒక అరగంట అవుతుంది"

విరగడయ్యారని అనడంలోనే ఆమెకి వారిపట్ల వున్న ఆదరాభిమానాలు స్పష్టమవుతున్నాయి. కోటు జేబులో వున్న ముప్పయి రూపాయిలూ బీరువాలో దాచమని, కథేమిటో చెప్పమన్నాను.

"మన యిల్లు పావనం చేదామని వేంచేశారు, ఆసుబ్బులు వుంది చూశారూ, అది మన పెళ్ళికి మంగళహారతి కూడా పాడిందట—నాకు జ్ఞాపకమే లేదు."

"సుబ్బులు ఎవరు ?"

"బక్క పలచగా వున్న అమ్మాయి."

"మనిషికి తగ్గట్టుగా పేరులేదు. మంగళహారతి పాడింది- మంచిపని చేసింది. ఇంతకీ వాళ్ళు పురుషోత్తంగారికి ఏమవుతారు ? పురుషోత్తంగారు నీకేమవుతారు ?"

"పురుషోత్తంగారు నాకు బాబాయి అవుతాడట. ఆయనే చెప్పుకున్నా డావరస—నాకు తెలియదు. సుబ్బులు ఆయనకూతురు. వోణీ వేసుకున్న అమ్మాయి వుంది చూశారూ, ఆ అమ్మాయి పురుషోత్తంగారికి కాబోయే కోడలు. తాటకి..."

"తాటకి ఎవరూ ?"

"ఆ హిడింబి లేదండీ, పురుషోత్తంగారికి కాబోయే వియ్యపురాలు."

"బావుంది, బావుంది. హిడింబి, తాటకీనా! ఇదేనా బంధుమర్యాద. నేనే నయం నీకంటె! వాళ్ళకి నిష్కారణంగా పేర్లు పెట్టను."

"పేర్లు పెట్టరు—నెత్తిని రాయి పెడతారు. ఇంతకీ వాళ్లు ఎందుకొచ్చారో తెలుసా—వైశాఖంలో ఆ పిల్ల పెళ్ళట. నాలుగైదు వేలుపెట్టి చీరెలూ నగలూ కొంటున్నప్పుడు—యిక్కడా అక్కడా ఎందుకు—తిన్నగా పట్నంలోనే కొందామని, ఇక్కడికి వచ్చారు."

"అంత డబ్బు వున్నవాళ్ళు మనమీద విరుచుకుపడటం ఎందుకు ? మద్రాస్‌లో కావలసినన్ని హోటల్స్ ఉన్నాయి" అన్నాను నేను.

"అక్కడ ఈ వియ్యపురాలికి మర్యాద ఎలా సాగుతుంది? ఆచారం!"

"ఆచారం కూడానా! మరి వియ్యంకుడు లేడా—ఆమె పునిస్త్రీపడుచులాగానే ఉంది."

"లేకేమి! ఆయనా, ఆయనకి కాబోయే అల్లుడూ రేపు వుదయం మెయిల్‌లో దిగుతున్నారు—స్టేషన్‌కి వెళ్తారా యేమిటి?"

కత్తివాటుకి నెత్తురుచుక్క లేకపోవడమంటే ఏమిటో తెలిసింది.

*　　　*　　　*　　　*

పురుషోత్తంగారు ఆ రాత్రి మిఠాయి పొట్లాలు పట్టుకొచ్చాడు. ఆ నూనెమిఠాయి మేమెక్కడ తినగలం? సుబ్బులూ, పెళ్ళికూతురూ అదేపనిగా తింటూ వుండటం చూసి, మద్రాస్‌లో కలరావుందని చెబుదామనుకున్నాను గాని, నోరు కట్టేసుకున్నాను.

ఇంకో తమాషా; సుబ్బులకీ, పెళ్ళికూతురికీ నన్ను చూస్తే సిగ్గు. ఘోషా, వాళ్ళు అటువస్తే, నేను యిటు తప్పుకోవాలి. చదరంగంలోని గుర్రంలా యిటూ అటూ గెంతడంతో నా పని వుక్కిరిబిక్కిరయేది. నా ముందునుంచి వెళ్తున్నప్పుడు హిడింబి కూడా వొంటినిండా పైట గప్పుకు, తల నేలలోకి వంచుకు వెళ్ళేది. ఆ పిల్లలిద్దరూ తలుపు సందులలోనుంచి చూసేవారుగాని, ఎదుట పడేవారు

కాదు. అదంతా స్త్రీ సౌజన్యంగా భావించే పురుషోత్తాన్ని వాళ్ళనీ వీధిలోకి గెంటి, వాళ్ళ సామాను అవతల పారేద్దా మన్నంత కసిగా ఉండేది. కాని చెయ్యలేకపోయాను.

మర్నాడు పొద్దున్న పురుషోత్తంగారి వియ్యంకుడూ కుమారరత్నంకూడా దిగారు. వారివెంట వారి చాకలివాడు కూడా వచ్చాడు—పట్నం చూడటానికి. ఈ బంధువులు ఒకవారం రోజులపాటు మాయింటిని ఆక్రమించుకున్నారు, దురాక్రమణ—అంటే నమ్మండి. ఆరశానుల పాలు ఏ మూల కని హిడింబి రెండుపళ్ళపాలు పోయించుకునేది ప్రతి ఉద యం. గరిట తను చేతబుచ్చుకుంది; శాంతాదేవి దగ్గిర డబ్బు పుచ్చుకుని కూరలు తను తెప్పించేది. ఆ వారం రోజులూ శాంతాదేవి ఆమెదగ్గిర సర్వెంట్ మెయిడ్ అయి పోయిందంటే నమ్మండి.

వియ్యంకుడు, పురుషోత్తం, పురుషోత్తం కుమారుడు, పెళ్ళి కూతురూ, హిడింబి, సుబ్బులు—వీళ్ళు ఆరుగురూగాక, చాకలాడు ఏడవవాడు. వాడొక్కడే వీళ్ళందరిలోకీ తెలివి గలవాడంది శాంత. ఎందుకంటే వాడు పురుషోత్తాన్ని డబ్బులు అడిగి, హోటలులో భోం వేసేవాడుగాని యింట్లో తినేవాడు కాదట.

ఈ బంధువులు వెళ్ళేనాటికి మా రేడియో మోగడం మానేసింది; ఫాన్ తిరగడం మానేసింది; నాలుగు గాజు గ్లాసులూ ఒక కాఫీపాటూ పగిలాయి; డ్రెస్సింగ్ టేబుల్

మీద వున్న దంతపు కొంగ ముక్కు విరిగింది. గోడలకి అక్కడక్కడ పురుషోత్తంగారు పీల్చే నశ్యం మరకలు. ఒక టేమిటి—అంతా గందరగోళమే. జబ్బుపడి లేచినంత పని అయింది.

“రిపేర్లూ, చేబదుళ్ళూ కలిపి రెండువందలు ఖర్చు; వారం రోజులు మనస్తాపం. వాళ్ళు వెళ్ళిన తర్వాత నాలుగు కిస్తీలు తీసింది శాంత.

పురుషోత్తంగారి కొడుకు పెళ్ళి చాలా వైభవంగా జరిగిందని విన్నాం. శుభలేఖ మట్టుకు మాకు రాలేదు. అందుకు మేమేమీ విచారించడం లేదు. కాని ఆపిల్ల పురుడు పోయించేందుకు ఎగ్మూర్ హాస్పిటల్‌కి తీసుకు వస్తారేమోనని భయంగా ఉంది.

---